క్లుప్తంగా

సత్తెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


సత్తెమ్మ తల్లి

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసం తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. దాతల సాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి రాక

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో జరుగుతున్న వారాహి నవరాత్ర మహోత్సవాలకు చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరి స్వామి ఆదివారం విశిష్ట అతిథిగా హాజరై ఉపన్యసించారు. విశ్వశాంతి కోసం ఆదివారం అర్ధరాత్రి యమ ధర్మరాజు, ధూమ్ర శనైశ్చర, మహా మృత్యుంజయ సహిత విదేహ జ్ఞాన ముక్తి హోమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠం పూర్వపరాలు, పీఠాధిపతుల పరంపర గురించి భక్తులకు వివరించారు. పీఠం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య, విద్య, సామాజిక సేవలను తెలిపారు. కార్యక్రమంలో శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, సంస్థ ప్రతినిధులు నాగ కనకదుర్గ, లింగోలు విస్సు, అరిగెల బుజ్జి, తూము దొరబాబు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో రజకులకు అవకాశం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రజక నాయకులు

ముమ్మిడివరం: నామినేటెడ్ పదవుల్లో రజకులకు అవకాశం కల్పించాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మండల రజక సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలో ఆదివారం రాంబాబు అధ్యక్షతన మండల రజక సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి విజయానికి రజకులంతా పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. దేవాలయాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో వస్త్రాలు శుభ్రపరిచే కాంట్రాక్టును రజకులకు కేటాయించాలన్నారు. సమావేశంలో కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, కేశనకుర్తి సురేష్, నడవపల్లి వీర వెంకట సత్యనారాయణ, కమిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా కళా వెంకట్రావు జయంతి వేడుకలు


కళా వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని అమ్మమ్మ ఉచిత యోగా శిక్షణా కేంద్రం వద్ద మాజీమంత్రి కళా వెంకట్రావు 125వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి కళా వెంకట్రావు మనవడైన కళా వెంకట్రావు అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కోనసీమను మిగతా ప్రాంతాలకు అనుసంధానం చేసిన అభివృద్ధి ప్రదాత కళా వెంకట్రావు అని సంస్కార భారతి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, సప్పా నాగేశ్వరరావు, వలవల నాయుడు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లో సౌకర్యాల లేమి

కాట్రేనికోన: దక్షిణ కాశీగా పేరు పొందిన పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు పుష్కర ఘాట్ వద్ద సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. పుష్కర ఘాట్‌లో స్నానం చేసేందుకు అనువుగా లేకపోవడం, ఆలయం వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ, దేవదాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

విగ్రహ ధ్వంసంపై పోలీసుల ఉదాసీనత తగదు

అమలాపురం టౌన్: రామచంద్రపురం నియోజకవర్గం వెల్ల గ్రామంలో ఇటీవల జరిగిన అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం కేసులో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా శాఖ కార్యదర్శి కొండా దుర్గారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు కేసును డాగ్ స్క్వాడ్‌కు అప్పగించి వాటి వెనుక పరుగులు తీయడమే సరిపోతోందని ఆరోపించారు. తక్షణమే దోషులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వసతి గృహాలు.. సమస్యల నిలయాలు

- పట్టణంలోని వసతి గృహాల్లో అసౌకర్యాల తిష్ట
- పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో వెంటాడుతున్న పాముల భయం

అమలాపురం టౌన్: పట్టణంలో సాంఘిక, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ఓ చోట వసతి గృహం పూర్తిగా శిథిలమైతే మరికొన్ని చోట్ల వసతి గృహాల్లో తాగునీటి సరఫరా, మరుగు దొడ్ల నిర్వహణ సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొన్ని వసతి గృహాల ప్రాంగణాలను, పరిసరాలను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో విద్యార్థులను విషసర్పాల భయం వెంటాడుతుంది.

అమలాపురం పట్టణంలో వడ్డిగూడెం, గొవ్వాల వీధి, మద్దాలవారిపేట, కొంకాపల్లి, ఈదరపల్లి, ఎర్ర వంతెన, ఆర్డీవో కార్యాలయం వెనుక ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నాయి. కాలేజీ, పాఠశాల వసతి గృహాలుగా ఉన్న ఈ వసతి గృహాల్లో దాదాపు రెండు వేల మంది విద్యార్థులకు నీడ, గూడై సేవలు అందిస్తున్నాయి. ఇటీవల ఈ వసతి గృహాలను మూడు రోజుల పాటు జిల్లా సీపీఎంతో పాటు పలు విద్యార్థి సంఘాల ప్రతినిధులు సందర్శించారు. అయా వసతి గృహాల్లోని విద్యార్థులతో మాట్లాడి అసౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సంక్షేమ అధికారులతో చర్చించి వసతి గృహాల్లో తిష్ట వేసిన సమస్యల చిట్టాను వివరించారు.

ఇదీ పరిస్థితి

- కొంకాపల్లిలోని బాలుర వసతి గృహ భవనం పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ ఆ భవనంలో ఉంటున్నారు. విద్యార్థుల రక్షణ కోసం తక్షణమే వేరే భవనంలోకి వసతి గృహాన్ని మార్చాల్సి ఉంది. లేదా తక్షణమే శిథిల భవనం స్థానే కొత్త భవనాన్ని నిర్మించాల్సి ఉంది.
- వడ్డిగూడెంలోని కాలేజీ బాలికల వసతి గృహ ప్రాంగణం, పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. అక్కడ తాగునీటి సరఫరాకు సంబంధించి సంపుపై కనీసం మూత కూడా వేయకపోవడంతో దుమ్ము, ధూళి వెళ్లిపోతున్నాయి.
- పలు వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్‌లు పనిచేయక మూలన పడ్డాయి. విద్యార్థులు కుళాయిల ద్వారా వచ్చే తాగునీటితోనే దాహార్తిని తీర్చుకుంటున్నారు. అందుకే ముఖ్యంగా రిపేరులో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేసి తక్షణమే పునరుద్ధరించాలి.
- వసతి గృహాల ప్రాంగణాలు, పరిసరాల్లో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించి వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. తద్వారా విద్యార్థుల్లో నెలకొన్న విష పురుగుల భయాన్ని పోగొట్టాలి.
- వసతి గృహాల్లో పర్యవేక్షకులుగా ఉండే సంక్షేమ అధికారులు సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులు సొంత పనుల కోసం బయటకు వెళ్లిపోతున్నారని ఇటీవల ఆ వసతి గృహాలను పరిశీలించిన సీపీఎం, విద్యా సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.


కొంకాపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న బాలుర సంక్షేమ వసతి గృహ భవనం


వడ్డిగూడెంలో మూత వేయకుండా వదిలేసిన తాగునీటి సంపు


పిచ్చిమొక్కలతో నిండిపోయిన వడ్డిగూడెం బాలికల వసతి గృహ ప్రాంగణం

వసతి గృహాలను గాడిలో పెట్టాలి



పట్టణంలోని సాంఘిక, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖకు చెందిన వసతి గృహాలు సమస్యలతో సతమవుతున్నాయి. వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వంటశాలల్లో అనేక సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. ఈ అసౌకర్యాలను సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. ముఖ్యంగా కొంకాపల్లి వసతి గృహం శిథిలమైన దృష్ట్యా దానికి తక్షణమే మరమ్మతులైనా చేపట్టాలి. లేదా విద్యార్థులను వేరే భవనంలోకి మార్చాలి. సమస్యలను పరిష్కరించి వసతి గృహాలను గాడిలో పెట్టాలి.

– కారం వెంకటేశ్వరరావు, కన్వీనర్, జిల్లా సీపీఎం పార్టీ, అమలాపురం

అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

అమలాపురం పట్టణంలోని వసతి గృహాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే వసతి గృహాల్లో ఉన్న అసౌకర్యాలను గుర్తించాం. వసతి గృహాల వారీగా అభివృద్ధి కోసం నిధులు కోరాం. నిధులు విడుదల అయిన తర్వాత పనులు చేపడతాం.

– జ్యోతి లక్ష్మీదేవి, జిల్లా ఇన్‌చార్జి అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం


నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో కోనసీమ, గొల్లపాలెం, తూరంగి, తాళ్లరేవు లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. మల్టిపుల్ జీఎల్‌టీ కోఆర్డినేటర్ డీవీఎస్ రాజు(రమేష్) నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పొన్నాడ పేరయ్యరాజు, కార్యదర్శిగా పెనుమల్లు నరేంద్ర వరప్రసాదరెడ్డి, కోశాధికారిగా కట్టా ఆదినారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. కోనసీమ అమలాపురం క్లబ్ అధ్యక్షునిగా తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శిగా దంగేటి శివరామకృష్ణ, కోశాధికారిగా మట్టపర్తి శ్రీనివాస్, తూరంగి క్లబ్ అధ్యక్షునిగా సాగిరాజు గోపాలరాజు, కార్యదర్శిగా ఎస్ఎస్ఎస్‌వీ ఆంజనేయశర్మ, కోశాధికారిగా సీహెచ్ఎస్‌వీఆర్ కృష్ణ, గొల్లపాలెం క్లబ్ అధ్యక్షునిగా సాగిరాజు సూర్యనారాయణ రాజు, కార్యదర్శిగా కొల్లు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మండపాటి రఘునాథరాజులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు సత్కరించారు. వల్లీబాబా ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు కాపులపాలెం రవి డిగ్రీ కళాశాల చైర్మన్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వేలూరి సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్, నున్న దత్తు, చిక్కాల నరసింహమూర్తి, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

- యానాంకు అందించిన సహకారానికి కృతజ్ఞతగా కార్యక్రమం
- మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహణ


మల్లాడి కృష్ణారావు

యానాం: అపర భగీరథుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం యానాంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 14వ ముఖ్యమంత్రిగా మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయమైన పాలనలో యానాంకు అందించిన సహాయానికి కృతజ్ఞతగా ఆయన జయంతి వేడుకలు చేస్తున్నామన్నారు. 1940లో ఫ్రెంచి-బ్రిటీష్ పాలకుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న యానాం అవసరాలకు 19 క్యూసెక్కుల గోదావరి నీటిని కేటాయించారన్నారు. అయితే ఆ నీరు ఒక పంట సాగుకే సరిపోయేదన్నారు. ఈ నేపథ్యంలో 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 53 ఎకరాల భూమిని రక్షిత మంచినీటి అవసరాలకు కేటాయించారని, అదేవిధంగా 19 క్యూసెక్కుల నీటిని కాస్తా 30 క్యూసెక్కులు ఇచ్చే విధంగా ఒప్పందం జరిగిందన్నారు. ఆయన సహకారంతో పిల్లంక నుంచి నాలుగున్నర కిలోమీటర్ల మేర ఆధునీకరణకు అనుమతి, పంపింగ్ హౌస్, లింకింగ్ చానల్ నిర్మాణాలు జరిగాయన్నారు. ప్రత్యేక జీఓ ద్వారా ధవళేశ్వరం నుంచి యానాంకు 3 క్యూసెక్కుల తాగునీటి సరఫరాకు భూగర్భ పైపులైన్ పథకం అమలు సైతం వైఎస్సార్ వల్లే జరిగిందన్నారు. దీనికోసం ధవళేశ్వరం వద్ద 1000 గజాల స్థలాన్ని యానాంకు కేటాయించారన్నారు. అందుకు కృతజ్ఞతగా యానాం ముఖ ద్వారం వద్ద భారీ వైఎస్సార్ కాంస్య విగ్రహంతో పాటు అంతర్జాతీయ ఇండోర్ స్టేడియానికి, లింకింగ్ చానల్‌కు, రక్షిత మంచినీటి పైపులైనుకు వైఎస్సార్ పేరును నామకరణం చేసినట్లు తెలిపారు. యానాంకు అందించిన సేవలకు వైఎస్సార్‌ను స్మరించుకునేందుకు అన్ని గ్రామాల రైతు సంఘాలు, స్థానిక నాయకులు, అభిమానులు, ప్రభుత్వ శాఖల అధికారులు సైతం ఈ జయంతి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలి


మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ సెక్రటరీ-6 యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న దాదాపు 35 శాఖల్లో తమను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని జిల్లా పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్) యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం వినతి పత్రం అందించారు. అమలాపురంలోని మంత్రి స్వగృహం వద్ద యూనియన్ ప్రతినిధులు కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. తమకు ఎంటెక్, ఎంసీఏ, బీటెక్ వంటి టెక్నికల్ క్వాలిఫికేషన్స్ ఉన్నాయని, తమను ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. తమకు పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు కొండా నాగ వెంకటేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు జగడం కిరణ్, అడ్డగళ్ల శ్రీను, కడలి సంజయ్, రామోజీ తదితరులు మంత్రికి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం


గురు పూజోత్సవంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

యానాం: స్థానిక కామిశెట్టివారి వీధిలోని గీతామందిరంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న మాట్లాడుతూ సమాజంలో గురువు యొక్క విశిష్టత, మన సంప్రదాయంలో గురువులకిచ్చే స్థానం గురించి వివరించారు. గత కొన్నేళ్లుగా ఆర్ఎస్ఎస్ శాఖ నుంచి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు, ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ కార్యవర్గ సభ్యుడు పతివాడ రామరాజు, కొండమూరి భాస్కరరావు, కోలా సుబ్రహ్మణ్యం, కలిదిండి సత్యనారాయణరాజు, తుపాకుల ప్రసాదరావు, కంచర్ల పెదబాబు, చింతలపూడి రాంపండు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ దినోత్సవం


నంగవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: మండలంలోని నంగవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ 30వ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తొత్తరమూడి బాబులు, పలివెల రాంబాబు, జొన్నాడ సత్యనారాయణ, వంగలపూడి నరసింహమూర్తి, పలివెల పెద్దిరాజు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ముమ్మిడివరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద దివ్యాంగుల రాష్ట్ర కమిటీ నాయకులు నలమాటి లంకరాజు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖండవిల్లి ఎలియా, ఆకుమర్తి సాయికృష్ణ, ఉండ్రాజవరపు కృష్ణమూర్తి, పెదపూడి రుక్మిణి పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలోని చెయ్యేరు నేతాజీ నగర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చేట్ల దుర్గారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నేతాజీనగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సవరపు రాజు ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక


ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న అల్లవరం ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అల్లవరం: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా స్థానిక గణపతి పబ్లిక్ స్కూల్ వేదికగా కలుసుకుని అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పూర్వ విద్యార్థులంతా సొసైటీగా సంఘటితమై కష్టసుఖాల్లో ఒకరికొకరు సాయం చేసుకునే దిశగా నిర్ణయం తీసుకున్నామని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మంగళంపల్లి సుబ్రహ్మణ్యం, కంకిపాటి గణపతి, కడలి శివన్నారాయణ, అడపా శ్రీనివాసరావు, బసవా భారతి, కుడుపూడి రమాదేవి, బాలగంగాధర తిలక్, బొంతు నాగేశ్వరరావు, ఆదుర్తి కృష్ణకుమారి, కొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శోక సంద్రంలో షియా ముస్లింలు


పీర్లను ఊరేగిస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: షియా ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్‌ను అప్పటి పాలకులు క్రూరంగా బంధించి హింసించిన రోజులను గుర్తు చేసుకుంటూ అమలాపురం పట్టణంలో ఆదివారం నెలవంక చూసిన తరువాత షియా ముస్లింలు మొహర్రం నెలను శోక తప్త హృదయాలతో ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హోర్దాయి నుంచి అమలాపురానికి వచ్చిన మత గురువు సయ్యద్ షబ్బర్ హసన్ మొహర్రం సందేశం ఇచ్చారు. స్థానిక 12వ వార్డు ముజఫర్ సందులోని అబ్బాసియా పంజా వద్ద మొహర్రం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి షియా పెద్దలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు పీర్లను ఊరేగించి పండగను నిర్వహించారు.

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించవద్దు

ఐ.పోలవరం: మండల పరిధిలో వివిధ ప్రభుత్వ స్కూల్స్‌లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించవద్దని కోరుతూ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికులంతా ఆదివారం వినతిపత్రం అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాట్రేనికోన మండలంలోని పల్లిపాలెం, కొప్పుగుంట, బలుసుతిప్ప ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, శానిటేషన్ వర్కర్లను తొలగించి టీడీపీ కార్యకర్తలను వేస్తామని టీడీపీ నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విప్పర్తి మోహన్‌రావు, విత్తనాల రాంబాబు, బొంతు పార్వతి, గుత్తుల కనకదుర్గ, వెంకటలక్ష్మి, రత్నకుమారి, వీరవేణి , చికురుమిల్లి శాంతి, భారతి పాల్గొన్నారు.

ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసిన యానాం వాసులు

యానాం: ఫ్రాన్స్ దేశంలో ఆదివారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో యానాంలో నివసిస్తున్న సుమారు 60 మంది ఫ్రెంచి పౌరులు తమ ఓటు హక్కును ఆన్‌లైన్ విధానం ద్వారా వినియోగించుకున్నారు. ఈ మేరకు పుదుచ్చేరిలో ఫ్రెంచి కాన్సులేట్ జనరల్ ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ విధానం ద్వారా గత కొద్దిరోజులుగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు తెలిపారు. చివరిరోజు ఆదివారం జరిగిన రెండో రౌండ్‌లో 59.71 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు


న్యాయవాది రవికుమార్‌ను సత్కరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు సత్యవరప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో అమలాపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. న్యాయవాది నల్లా రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాల పనితీరు గురించి వివరించారు. అనంతరం న్యాయవాది రవికుమార్‌ను క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ సత్కరించారు. సదస్సులో క్లబ్ సెక్రటరీ వలవల వెంకటరెడ్డి నాయుడు, కోఆర్డినేటర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీ, కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, పచ్చిగోళ్ల శ్రీను, నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


దరియాలతిప్ప రైతు సంఘం నూతన కార్యవర్గం

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప రైతు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా తిరుకోటి భైరవమూర్తి, ఉపాధ్యక్షుడిగా వాకపల్లి సుబ్బారావు, కోశాధికారిగా సబ్బతి లోకేశ్వరరావు, కార్యదర్శిగా మట్టా రాంబాబు, సహాయ కార్యదర్శిగా సబ్బతి రాంబాబు, సభ్యులుగా కోరుకొండ అప్పన్న, యడ్ల లోవరాజులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తిరుకోటి భైరమూర్తి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పుదుచ్చేరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటు


నిఖిల్

యానాం: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో ఆదివారం టీ 20 క్రికెట్ పుదుచ్చేరి ప్రీమియర్ లీగ్(పీపీఎల్)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీపీఎల్‌లో ఆడే జట్లను సైతం ప్రకటించారు. ఈ సందర్భంగా నాలుగు రీజియన్ల నుంచి మొత్తం 6 జట్లు, క్రీడాకారులను వెల్లడించారు. ఈ సందర్భంగా యానాం రాయల్స్ జట్టుకు యానాంకు చెందిన అన్నంనీడి నాగవెంకట్ నిఖిల్ ఎంపికయ్యారు. ఆగస్టు 5వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ పుదుచ్చేరిలోని తూటిపేటలో సియోచమ్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మ్యాచ్‌లను స్టార్ టీవీ చానల్ తొలిసారిగా ప్రసారం చేయనుందని పీపీఎల్ చైర్మన్ ఎస్. మహేష్ తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్

రావులపాలెం: కిరాణా షాపు చోరీ చేసిన ఘటనలో ఒక ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.1,40,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల మూడో తేదీన మండలంలోని గోపాలపురం గ్రామంలో ఒక కిరాణా షాపులో చోరీచేసిన ఘటనపై షాపు యజమాని కంకటాల వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన కందవల్లి సీతారాముడు అనే ముద్దాయిని ఆదివారం స్థానిక బస్టాండ్‌లో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.లక్షా నలభై వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.